క్లుప్తంగా

పీపీడీఎస్ ఆధ్వర్యంలో అన్నదానం



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఆహార ప్యాకెట్లను అందిస్తున్న పీపీడీఎస్ సభ్యులు

ఆదోనిసెంట్రల్: మానవసేవే మాధవ సేవ అని పీపుల్స్ అవేర్‌నెస్ డెవలప్‌మెంట్ సొసైటీ (పీపీడీఎస్) అధ్యక్షులు ఆరెంజ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం పీపీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు, యాచకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభాగ్యులకు తమ సంస్థ ద్వారా అన్నదానం చేసి వారి ఆకలి తీర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే పేద ప్రజల కోసం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణ, సుజన, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తమాలజిస్ట్ ఎన్‌జీ వీరన్న

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో కర్నూలు అమిలీయో హస్పెటల్ వారి సౌజన్యంతో ఆప్తమాలజిస్ట్ అసిస్టెంట్ ఎన్‌జీ వీరన్న ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లంకారెడ్డి సమక్షంలో గ్రామంలో దాదాపు 100 మంది దాకా ఓపీ ద్వారా కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. మండలంలోని వందగల్లు, పల్లెపాడు, మాలపల్లి గ్రామాల నుంచి మొత్తం 30 మందిని నేడు ప్రత్యేక బస్సులో కర్నూలుకు తరలించి ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. వారికి భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

ఆదోనిసెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు కాశీవిశ్వనాథ్, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కోరారు. ఈ మేరకు ఆదివారం ఆదోని డివిజన్ స్థాయి సమావేశాన్ని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సబ్జెక్టు టీచర్ విధానంతో ప్రాథమిక విద్య నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించడంతో భవిష్యత్‌లో ప్రాథమిక స్థాయి బడులు ఉండే పరిస్థితి కనిపించడం లేదన్నారు. తక్షణమే ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్టీయూ జిల్లా నాయకులు, జిల్లా కౌన్సిలర్లు, కార్యకర్తలు వి.శ్రీనివాసులు, నాగప్రసాద్, బసవరాజు, హనుమన్న, ఎం.శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, తిమ్మప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు



ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపును సోమవారం చేపట్టనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. శ్రావణమాసం ఉత్సవాల తర్వాత ఈ నెల 21న గురువారం హుండీ లెక్కింపు జరిగిందని మళ్లీ సోమవారం రెండవ సారి హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే వారు పంచె, ఉత్తరీయం (టవల్) తప్పక ధరించాలన్నారు.

అలరించిన హరికథ పారాయణం



హరికథను ప్రవచిస్తున్న హరిదాసరు పీవీ రావు

మంత్రాలయం: చాతుర్మాసాన్ని పురస్కరించుకుని రాఘవేంద్ర స్వామి మఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథ పారాయణం, దాస సాహిత్య కచేరి కార్యక్రమాలు చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం కర్ణాటకలోని మంగళూరుకు చెందిన పీవీ రావు అనే హరిదాసరు హరికథ పారాయణం గావించారు. విష్ణు భగవానుడు, లక్ష్మీదేవి చరితను హరికథ రూపంలో ప్రవచించిన విధానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కథ పారాయణంలో ఆలపించిన కీర్తనలు వీనులవిందు చేశాయి. కార్యక్రమంలో శిష్య సంపర్కాధికారులు వాదీరాజాచార్, మంచాలి పద్మనాభ ఆచార్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సమగ్రాభివృద్ధి

- రూ.45 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్
- నాలుగేళ్లలో ఆదోనిలో రూ.22 కోట్లతో సీసీ రోడ్లు



ఆదోనిలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ తదితరులు

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలలో ఆదోని మున్సిపాలిటీలో రూ.22 కోట్లతో వీధి వీధి సందుసందునా సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయడం జరిగిందని చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదోని అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఆదివారం పట్టణంలోని 26, 27, 36 వార్డుల్లో రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫండ్స్ లేవని, బిల్లులు రావడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అలాంటి అపోహలను నమ్మవద్దని సూచించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. వివిధ పథకాల కింద మున్సిపాలిటీలో నిధులు జమ అవుతూ ఉంటాయని, వాటికి తోడు జనరల్ ఫండ్స్ నిధులు రూ.కోట్లలో ఉంటాయన్నారు. ఆయా నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతోందన్నారు. 26, 27 వార్డుల్లో రూ.23 లక్షలతో, 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన రూ.22 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. లోతట్టు ప్రాంతం కావడం వల్ల గతంలో చిన్నపాటి వర్షం కురిసినా వరద, మురుగునీరు రోడ్లపై చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేదని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీవాసులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే మేదర్ గేరి, పీఎస్ టాకీస్, భజరంగదల్ గుడి ఏరియా ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. వైస్ చైర్మన్లు నరసింహులు, గౌస్, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, సురేష్, సన్ని, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, రామదాసు, బాలాజీయాదవ్, పార్టీ కార్యకర్తలు, నాయకులు, వీధిపెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆదోనిగా మారుద్దాం



స్వచ్ఛభారత్‌లో భాగంగా శక్తిగుడి ఏరియాలో ర్యాలీగా వెళ్తున్న అధికారులు, నాయకులు

ఆదోనిటౌన్: స్వచ్ఛభారత్‌లో భాగంగా పట్టణాన్ని స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దుదామని మున్సిపాలిటీ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆదోని కార్యక్రమంలో భాగంగా ఆదివారం శక్తి గుడి ఏరియాలో వీధి ప్రజలతో కలిసి కౌన్సిలర్లు ఉమామహేశ్వరి, సురేష్ ఆధ్వర్యంలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేసి అపరిశుభ్రం చేయవద్దన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి డస్ట్‌బిన్లలో వేసి పట్టణాభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలన్నారు. వీధిలో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాలు, పార్కుల్లో విరివిగా మొక్కలు నాటి స్వచ్ఛదనాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లను ఊడ్చి పరిశుభ్రం చేశారు. ప్రతిఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా అక్కినేని జయంతి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కార్వన్‌పేటలో శ్రీ లలిత కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు, అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షులు డాక్టర్ జి.నల్లారెడ్డి, ఉపాధ్యక్షులు హనుమాన్‌సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు పేదరికంలో పుట్టి కష్టపడి సినీ రంగంలో అగ్ర కథానాయకుడిగా ఎదిగాడన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి తోటి కళాకారులకు చేయూతనందించారన్నారు. మద్రాసు రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీని తరలించే విషయంలో తన దైన పాత్ర వహించాడన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. అక్కినేని అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీమఠం ప్రాకారంలో ప్రదక్షిణలు చేస్తున్న న్యాయమూర్తి సోమరాజన్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేరళ హైకోర్టు న్యాయమూర్తి సోమరాజన్ ఆదివారం రాత్రి మంత్రాలయం విచ్చేశారు. మఠం ఏపీఆర్వో బిందు స్వామి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలుకగా ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు న్యాయమూర్తికి రాయరు జ్ఞాపిక, శేష వస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఆయనతోపాటు ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఉన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



జడెప్ప తాత చిత్రపటాలను ఊరేగిస్తున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలోని తేరు బజారుకు ఆనుకుని వెలిసిన జడెప్ప, అయ్యప్ప తాతల ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గుంతకల్, సిరుగుప్ప, బళ్లారి, ఆదోని ఇతర దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఏటా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో ఆకు పూజ, అభిషేకాలు, అర్చనలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ చేశారు. అనంతరం తేరు బజారులో భక్తులు జడెప్ప, అయ్యప్ప తాతల చిత్రపటాలను ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

రమణీయం దక్షిణామూర్తి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు: ఆస్పరి మండలం కారుమంచి గ్రామంలో శ్రీ దక్షిణామూర్తి స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దక్షిణమూర్తి ఉత్సవమూర్తిని ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాలు, భాజాభజంత్రీలు, డోలు సన్నాయిల హోరు మధ్య రథంపై కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. అశేష భక్తజనం మధ్య శ్రీ దక్షిణామూర్తి ఆలయం నుంచి శివాలయం వరకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గణపతి, శాంతి హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. స్థానిక భక్తులే గాక ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఎస్‌ఐ వరప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

హెబ్బటంలో జష్నే మిలాద్

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో శనివారం రాత్రి జష్నే మిలాద్ నబి జల్సా కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక మసీదులో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని హాజరై బయాన్ విన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదోనికి చెందిన మతపెద్ద మహమ్మద్ జాకీర్ ఆఫీజ్ సాబ్ ఖురాన్ సందేశం వివరించారు. ఖరాన్ సూక్తులను, వాటి సారాంశం వివరంగా బోధించి సమాజంలో పాటించాల్సిన పద్ధతుల గురించి చెప్పారు.

'ఆస్పిరేషనల్ బ్లాక్'కు ఎంపిక

చిప్పగిరి: ఈ నెల 30న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమానికి మండలం నుంచి నలుగురు గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు అవకాశం లభించిందని ఎంపీడీఓ సీవీ కొండయ్య తెలిపారు. చిప్పగిరి, నంచర్ల, నేమకల్లు, డేగులహాలు సర్పంచులు గోవిందరాజులు, భీమన్న, ప్రేమ్‌కుమార్, నీలకంఠ, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రి, నరేంద్ర, నరసింహులు, సురేంద్రనాథ్ ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేపట్టాల్సిన విధానాలపై సమావేశంలో వివరిస్తారు.

రైతన్నకు పెద్ద కష్టం



జొన్నగిరిలో ఆముదం పంటను తొలగిస్తున్న దృశ్యం

తుగ్గలి: వర్షాభావంతో సరైన పెరుగుదల లేకపోవడంతో మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో బ్రహ్మారెడ్డి అనే రైతు మూడెకరాల ఆముదం పంటను తొలగించారు. ఆయన తనకున్న మూడెకరాలలో ఖరీఫ్‌లో ఆముదం పంట సాగు చేశాడు. సీజన్ ఆరంభం నుంచి సరైన వర్షాలు లేక పంట ఎదుగుదల లోపించింది. సీజన్ ముగుస్తుండడంతో ఎలాగూ ఇక పంట దిగుబడి రాదనే ఉద్దేశంతో ఆదివారం ట్రాక్టర్‌తో పంటను తొలగించాడు. దాదాపు రూ.60 వేల దాకా నష్టపోయినట్లు రైతు వాపోయాడు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం

ఆదోనిరూరల్: పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) కార్యాలయం వద్ద సత్యశోధక్ సమాజ్ 47వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అణగారిన కులాలకు విద్యను అందించడమే సత్యశోధక్ సమాజ్ లక్ష్యమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రమేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. అణగారిన కులాలకు పూర్తిస్థాయిలో విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కుల నిర్మూలన లక్ష్యంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఏఐకేఎంఎస్ రాజు, ఏఐఎఫ్ నాగేంద్రప్ప, పీడీఎస్‌యూ నాయకులు అఖండ, నరేష్ పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామంలో తాగునీటి బోరుకు గ్రామ సర్పంచ్ పాటిల్ ఈరన్న ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతులు చేయించారు. రెండు రోజుల క్రితం గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. ఇందుకు గ్రామ సర్పంచ్ స్పందించి యువకులతో కలిసి తాగునీటి బోరుకు మరమ్మతులు చేయించారు. అనంతరం యథావిధిగా గ్రామంలో తాగునీటిని సరఫరా చేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు





ప్రమాదంలో గాయపడ్డ కర్రెన్న, మోనయ్య

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సమీపంలోని మంత్రాలయం రోడ్డు జాతీయ రహదారిలో ఆదివారం ఉదయం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు బైకిస్టులు గాయాలపాలయ్యారు. నందవరం మండలం హలహర్వికి చెందిన కర్రెన్న ముగతి వద్ద మట్టి పనుల కోసం వచ్చి టిఫిన్ కోసం ఎమ్మిగనూరుకు బైక్‌పై వస్తున్నాడు. ముగతి ఫారం దగ్గర వే బ్రిడ్జి వద్ద కర్రెన్న బైక్‌కు ఎదురుగా వచ్చిన మోనయ్య బైక్ ఢీకొనటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం పోలీస్ రోడ్ సెఫ్టీ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రజారోగ్యమే 'సురక్ష' ధ్యేయం





కామవరంలో రక్త పరీక్ష చేస్తున్న దృశ్యం, ఉప్పరహాల్‌లో చెక్కర వ్యాధి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల రోగాలకు ఇక నుంచి చెక్ పెట్టవచ్చని బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇమ్మానియేల్ అన్నారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి కుటుంబ సభ్యుల ఆరోగ్య స్థితిగతులను ఆరోగ్య సిబ్బంది ద్వారా తెలుసుకుని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ నెల 30 నుంచి వైద్య సేవలను ప్రారంభిస్తున్నారని, ఈలోపే గ్రామాల్లో సర్వే చేపట్టి కుటుంబ సభ్యులందరికి బీపీ, షుగర్, థైరాయిడ్ వివిధ రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 11 సబ్ సెంటర్లలో తమ సిబ్బంది వలంటీర్ల సహాయంతో పరీక్షలను పూర్తి చేశారన్నారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించి చిన్నపాటి రోగమైనా తమ దృష్టికి తెస్తే వైద్యం అందించేందుకు సులభమవుతుందన్నారు. వైద్య సిబ్బంది సేకరించిన వివరాలతో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లోనే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారిని కర్నూలుకు పంపించి వైద్యం అందిస్తారని ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి మహత్తర కార్యక్రమాలలో పాల్గొని చికిత్సను చేయించుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మహాపూజ





రణమండల ఆంజనేయ స్వామికి హారతి ఇస్తున్న పూజారి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదోనిఅర్బన్: శ్రావణమాసం సందర్భంగా 41 రోజులు మండల దీక్ష చేపట్టిన ఆంజనేయ స్వామి భక్తులు ఆదివారం మహాపూజ చేశారు. భక్తులు మంజునాథ్, సోము ఆధ్వర్యంలో పట్టణ శివారులోని రణమండల ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని, విగ్రహాలను రంగురంగులతో, మామిడి ఆకుల తోరణాలు, అరటి బోదెలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర సేవ, తులసీహారం, వడలహారం, ప్రత్యేక పూలహారం, మహామంగళహారతి, నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే రణమండల కొండలో వెలసిన శ్రీ అంబాభవానీకి భక్తుడు శంకరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, పల్లకీ సేవ, ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



పెద్దభూంపల్లిలో పూర్తయిన సచివాలయ భవన నిర్మాణం

కోసిగి: మండల పరిధిలోని పెద్దభూంపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. త్వరలోనే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లోనే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించింది. ఇందులో భాగంగా మండలంలోని 19 సచివాలయాలను మంజూరు చేశారు. ఇది వరకే మండలంలో దాదాపు 5 సచివాలయాల నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఇందులో భాగంగా పెద్ద భూంపల్లి గ్రామ సచివాలయ నిర్మాణం పూర్తి కాగా త్వరలో ప్రారంభోత్సవానికి రంగం సిద్ధం చేశారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వర స్వామి

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ప్రధాన పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు రుద్రాభిషేక ఇతర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

దళితుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఎమ్మిగనూరుటౌన్: దేశంలో దళితులను అణగదొక్కి మతోన్మాదాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెచ్చగొడుతోందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవసహాయం, ఆనంద్‌బాబు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన దళిత రక్షణ యాత్రలో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు దళితులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. బీజేపీ అభివృద్ధి అనే మాటను పక్కన పెట్టి కులం, మతం పేరుతో వైషమ్యాలను సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 29న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కేవీపీఎస్ నాయకులు రాజా రమేష్, గుంటెప్ప తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి రక్షణ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం,ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు కోరారు. కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర జీపు జాతా ఆదివారం గోనెగండ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ దళిత హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు.


స్కూల్ గేమ్స్ చాంపియన్‌గా పెద్దహరివాణం



క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు

ఆదోనిసెంట్రల్: మండలంలోని పెద్దహరివాణం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచి సత్తాచాటారు. గత మూడురోజులపాటు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. అండర్–14, అండర్–17 పోటీల్లో బాలుర బాలికల విభాగాల్లో కబడ్డీ పోటీల్లో విజయం సాధించారు. అండర్–17లో మొదటిస్థానంలో నిలవగా, అండర్–14లో మూడో స్థానంలో నిలిచారు. అలాగే అండర్–14, అండర్–17లలో 400 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలిచారు. అండర్–17 విభాగం 800 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలిచారు. 1500 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచారు. అండర్–14 లాంగ్‌జంప్‌లో మొదటిస్థానంలో నిలిచారు. ఈ విధంగా ప్రతి పోటీల్లో పెద్దహరివాణం పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు. గతంలో కూడా ఇదే పాఠశాల నుంచి క్రీడా పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. క్రీడల ద్వారా గ్రామంలో పలువురు విద్యార్థులు మిలటరీ ఉద్యోగాలు సంపాదించినట్లు చెప్పారు.


సీనియర్స్‌ను స్ఫూర్తిగా తీసుకున్నాం



క్రీడా పోటీల్లో రాణించిన ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాం. మేము కూడా 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలవడం సంతోసంగా ఉంది. గేమ్స్‌లో మెలకువలు తీసుకొని జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటుతాం. వ్యాయామ ఉపాధ్యాయులు ఇస్తున్న ప్రోత్సాహం మరువలేనిది.

– నవీన్‌కుమార్, మంజునాథ్, పరుగుపందెం విజేతలు


చాలా సంతోషంగా ఉంది



400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది. 1500 మీటర్లలో రెండో స్థానంలో నిలిచాను. క్రీడల్లో ఇంకా మెలకువలు నేర్చుకొని జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలని భావిస్తున్నా. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది.

– గజ్జమ్మ, విద్యార్థిని

క్రీడల పట్ల ఆసక్తి ఉండాలి



క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తి ఉంటే ఎన్ని పోటీల్లోనైనా రాణించవచ్చు. నేను ఏడు సంవత్సరాలుగా పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఎంతో మంది విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుకుని నేడు ఉద్యోగాలు పొందారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ప్రతిఒక్కరూ చదువుతోపాటు క్రీడలు అవసరమని గుర్తించాలి.

– రామన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు